కాంగ్రెస్ నేత మహమూద్‌గౌస్‌కు పలువురి నివాళి


భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమూద్ గౌస్ మృతిపట్ల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సంతాపం తెలిపారు. మూడు దశాబ్దాగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ అనారోగ్యంతో బాగ్ అంబర్‌పేటలోని ఆయన నివాసంలో మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. నాయకులు చందు, రామకృష్ణ, శ్రీరామ్‌లు ముదిరాజ్, నర్సింగ్‌యాదవ్, నర్సింహారెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, సత్తిబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్నలో వేదపండితులు

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రధాన రోడ్‌లో ఉని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కార్యక్రమం కనులపండువగా జరిగింది. నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: రానున్న లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత కొండ్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. వారికి కాంగ్రెస్ కంటువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ గాలి విస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సంపత్‌కుమార్, హరీందర్‌రెడ్డి, చౌదరి, రాములు, వీరేందర్‌రెడ్డి, జగదీశ్‌రాజు, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఫోన్ చూడొద్దన్నందుకు ఇంటర్ విద్యార్థిని అదృశ్యం


అదృశ్యమైన బింగి హర్షిత

కాచిగూడ: ఫోన్ చూడొద్దంటూ తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హెచ్.నరేష్ సమాచారం మేరకు... తిలక్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన శంకర్ కుమార్తె బింగి హర్షిత(17) ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. హర్షిత తరచూ ఫోన్ చూస్తోంది. దీంతో తండ్రి ఎక్కువడా ఫోన్ చూడొద్దంటూ మందలించాడు. మనస్తాపానికి గురైన హర్షిత ఇంటి నుంచి బయతకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన హర్షిత తండ్రి మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాళి



అంబర్‌పేట: బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు తండ్రి ప్రభాకర్‌రావు చిత్రపటానికి ఆ పార్టీ నేతలు నివాళులు అర్పించారు. బుధవారం ఆయన నివాసానికి వెళ్లి గౌతమ్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ హరిచరణ్, గుత్త పాండురంగయ్య, ఉమాశంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం

దానం నాగేందర్ నామినేషన్‌కు భారీగా తరలిన పార్టీ శ్రేణులు

పలు ప్రాంతాల్లో బైకులతో ర్యాలీలు

సందడిగా సాగిన పార్టీ కార్యక్రమాలు


గాంధీనగర్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

చిక్కడపల్లి: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం తథ్యమని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ నామినేషన్ దాఖలు సందర్భంగా బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ... లోకసభ నియోజకవర్గంలో పార్టీ ఓటింగ్ చెక్కుచెదరలేదన్నారు. ర్యాలీ అనంతరం నామినేషన్ ర్యాలీకి తరలివెళ్లారు. పార్టీ నాయకులు గుర్రం శంకర్, అభిషేక్‌కెన్నడీ, జయేందర్‌బాబు, శీలం సత్యనారాయణ, గుండు జగదీశ్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, సుబ్బారావు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దానంకు సీపీఎం మద్దతు

ముషీరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలతో మతవిద్వేషాలను రెచ్చగొడుతూ నిరంకుశ పాలన కొనసాగించిందని సీపీఎం నేతలు ఆరోపించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు సీపీఎం మద్దతు తెలిపుతున్నామని సీపీఎం కార్యదర్శి ఎం.శ్రీనివాస్ వెల్లడించారు.

అంబర్‌పేట నియోజకవర్గం నుంచి...

అంబర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ నామినేషన్‌కు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బాగ్ అంబర్‌పేట నుంచి వెళ్లిన ర్యాలీని మాజీ ఎంపీ వీహెచ్ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, నారాయణ స్వామి, ఆర్.లక్ష్మణ్ యాదవ్, లక్ష్మపతి యాదగిరి గౌడ్, శంబుల శ్రీకాంత్‌గౌడ్, తులమూరి కృష్ణగౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


కాచిగూడలో ర్యాలీని ప్రారంభిస్తున్న వీహెచ్


బాగ్ అంబర్‌పేటలో...

బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తథ్యం

కవాడిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జీ, టీ పీసీసీ నాయకుడు గౌరీశంకర్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ప్రజలు ఎవరూ నమ్మడం లేదని ఈ రెండు పార్టీలు కుమ్మక్కై, ఎన్నికుట్రలు పన్నినా సికింద్రాబాద్ స్థానం కాంగ్రెస్‌దే అన్నారు. దానం నామినేషన్ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం నుంచి ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున బైక్‌లు, కార్ల ర్యాలీతో తరలివెళ్లారు. ర్యాలీని గౌరీశంకర్, మందడి అరవింద్‌కుమార్‌యాదవ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్లు కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, ముషీరాబాద్ ఏఅండ్‌బీ బ్లాక్ అధ్యక్షులు విడి కృష్ణ, అంజియాదవ్, డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, నగర కాంగ్రెస్ నాయకులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, పి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ స్టేడియం వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

నల్లకుంట నుంచి భారీ ర్యాలీ...

నల్లకుంట: కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా నల్లకుంట మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్ ఆధ్వర్యంలో తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ వి.హనుమంతారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 14 సీట్లు గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. దానం గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు సి.హెచ్.భగవాన్, ఎం.రాజు గౌడ్, జిల్లా వెంకటేష్, ఆర్.రవికుమార్, డి.రమేష్, లాలయ్య గౌడ్, అనిల్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో...

కాచిగూడ: కాంగ్రెస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు పిలుపునిచారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ ర్యాలీ నిర్వహించారు. దానం నాగేందర్ నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని వీహెచ్ ప్రారంభించారు. నేతలు ఆశ్లేష్, మహేందర్ యాదవ్, బాలరాజ్, దిలీప్, రోహన్, దీపిక, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి


ముషీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టి.పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బద్దిపోచమ్మ దేవాలయం నుంచి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నాయని ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. బీఆర్ఎస్ గ్రేటర్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ఎన్నికల పరిశీలకులు రంజన్‌నాయుడు, మున్వర్‌చాంద్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు టి.సోమన్, డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డాక్టర్ నీలా శ్రీధర్

కాచిగూడ: అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ (ఏఐసీసీ) జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరీ బుధవారం గాంధీభవన్‌లో నీలా శ్రీధర్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నీలా శ్రీధర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం కాంగ్రెస్ పార్టీ ఘనత అని అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉండి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిసామని అన్నారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలి స్త్రీ పక్షపాతి రాజారామ్మోహన్‌రాయ్


నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, శంకరనారాయణ, జనార్ధనమూర్తి

చిక్కడపల్లి: తొలి స్త్రీ పక్షపాతి రాజారామ్మోహన్ రాయ్ అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం రాజా రామ్మోహన్‌రాయ్ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... సతీసహగమనం వ్యతిరేక చట్టం బ్రిటిష్ వైస్రాయ్ బెంటింగ్ చేయించిన రాయ్ మహిళల హక్కుల పోరాటయోధుడు అన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ సుమారు రెండున్నర శతాబ్దాల క్రితం సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన రాయ్ హిందూ ఆచారాలలోని దుర్మార్గాన్ని వ్యతిరేకించి వారి బహిష్కరణకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు తిరువాణి చంద్రశేఖర్, గానసభ పాలకమండలి సభ్యులు గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

రేపు 'ఘంటసాల స్వరామృత ధార'



చిక్కడపల్లి: గాన గంధర్వుడు ఘంటసాల గానవైభవాన్ని మరో 50 ఏళ్ల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా ఈ నెల 26న సాయంత్రం త్యాగారాయ గానసభలో ఘంటసాల స్వరామృత ధార పేరిట స్వరసమ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం చిక్కడపల్లిలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు స్వరామృతధార యూట్యూబ్ చానల్ అధినేత్రి శివరమ్మధరణిప్రగడ మాట్లాడుతూ... ఘంటసాల పాడిన గీతాలు పద్యాలు, శ్లోకాలు, దండకాలు, భగవద్గీతలపై సమగ్ర అంశాలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న ప్రయత్నం ఇది అన్నారు. సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఘంటసాల గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఘంటసాల పాటలు, పద్యాలు, శ్లోకాలపై శరత్‌చంద్ర ఆలపిస్తూ విశ్లేషణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరిలేరు నీకెవ్వరు సినిమాలో రమణా లోడెత్తాలిరా చెక్‌పోస్టుపడుద్ది డైలాగ్ చెప్పిన నటుడు కుమనన్, అమెరికా నుంచి పద్మిని, స్వరజ్యోతి, నాగమణి, పశ్చిమబెంగాల్ నుంచి దేవి శ్రీనివాస్, జ్వారా కోటి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు


ఫైజా, 989 మార్కులు, సీనియర్ బైపీసీ


హర్షిత, 990 మార్కులు, సీనియర్ ఎంపీసీ


తల్లితో రుషిత (జూనియర్ ఎంపీసీ, 467 మార్కులు)


తండ్రితో నిహారిక (జూనియర్ ఎంపీసీలో 467మార్కులు)


తండ్రితో అక్షర (జూనియర్ ఎంపీసీలో 467 మార్కులు)


సాయిచైతన్య, సీనియర్ ఎంపీసీ, 986 మార్కులు


రూపస్, 463/470 మార్కులు, జూనియర్ ఎంపీసీ

ముషీరాబాద్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలు కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో హర్షిత అనే విద్యార్థి (990/1000) మార్కులు సాధించడం గమనార్హం. సీనియర్ బైపీసీలో ఫైజా (989/1000) మార్కులు సాధించి ఔరా అనిపించారు.

మెరిసిన నానో కళాశాల విద్యార్థులు...


నానో జూనియర్ కళాశాల డైరెక్టర్ కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి


సంబరాల్లో పాల్గొన్న డీడీ కాలనీ శ్రీచైతన్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

శంకర్‌మట్ సమీపంలోని నానో జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు విజయ దుందుబి మోగించారు. 98 శాతం పైగా మార్కులను 200 మంది విద్యార్థులు, 95 శాతం పైగా మార్కులను 450 మంది విద్యార్థులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 468 మార్కులను సృజనశ్రీ, సమన్వయ అనే విద్యార్థులు సాధించి హైదరాబాద్ జిల్లాలోనే నెంబర్‌వన్‌గా నిలిచారన్నారు. బైపీసీలో 438/440 మార్కులను ప్రశంస అనే విద్యార్థిని సాధించిందన్నారు. సీనియర్ బైపీసీలో 989/1000 మార్కులను ఫైజా, ఎంపీసీలో 990/1000 మార్కులను హర్షిత అనే విద్యార్థిని సాధించిందని తెలిపారు. ఇప్పటికే వీరు జేఈఈ మెయిన్స్ రాసిన వీరికి 99.75 పర్సెంటైల్ వచ్చిందని తెలిపారు. వీరికి తోడు రాంనగర్‌కు చెందిన ప్రేమ్‌సాగర్ కుమారుడు రూపస్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 463 మార్కులు సాధించారు.

డీడీ కాలనీలో సంబరాలు

అంబర్‌పేట: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య డీడీ కాలనీ శాఖ ఉత్తమ ఫలితాలు సాధించింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో కళాశాల ఆధ్యాపకులు, విద్యార్థులు సంబురాలు చేసుకున్నారు. ప్రథమ సంవత్సరంలో శివ సంజిత్ 470 మార్కులు గాను 462 మార్కులు సాధించారు. మరో 18 విద్యార్థులు 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో టి.రిషిక 1000 మార్కులకు 980 మార్కులు సాధించారు. డీన్ శ్రీనివాస రెడ్డి, ఏజీఎంలు సతీష్, అంకిరెడ్డి, అసోసియేట్ డీన్‌లు ఉదయ్‌కిరణ్, శ్రీవల్లి, ప్రిన్సిపాల్‌లు మాధవి, వెంకటరమణ, సుజాత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కాచిగూడ: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కాచిగూడ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. సెకండ్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో హెచ్ఈసీ గ్రూపులో పరబత్తిన అభ్యుదయ సుధ 967 మార్కులు సాధించి కాలేజ్ టాపర్‌గా నిలిచారు. బోయ మధురిషిత హెచ్ఈసీ గ్రూపులో 928 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వై.ఎస్.స్వర్ణలత తెలిపారు. సీఈసీలో పరేహన్ బేగం 857, ఎ.లక్ష్మణ్ 838, ఎంపీసీలో నదీమ్ అస్లామ్ 838, కె.మణి చందన 824 మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో సుదం కీర్తి 458 మార్కులతో ఏ గ్రేడ్ సాధించిందని, నీనవత్ ప్రవీణ్ సీఈసీలో 439 మార్కులతో ఏ గ్రేడ్ సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభ

ముషీరాబాద్: తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ సైబరాబాద్ ఏరియా 6వ మహాసభ బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగింది. ఏరియా సీనియర్ నాయకులు బి.ప్రభాకర్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కమిటీ నాయకులు ఎం.శ్రీనివాస్ ఈ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి అన్వేష్ ప్రసంగించారు.

నూతన కార్యవర్గం...

మహాసభ అనంతరం 26 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా బి.ప్రభాకర్, కార్యదర్శిగా మహ్మద్ అఫ్జల్, సహాయ కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, కోశాధికారిగా పి.సత్తయ్యలతో పాటుమరో 20 మంది నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

గోశాలలకు దాణా, నీటిని ప్రభుత్వమే సరఫరా చేయాలి

కాచిగూడ: వేసవిలో దాణా, నీరు సరిగా అందక గోశాలల్లో గోవులు చనిపోతున్నాయని, గోవులను రక్షించడానికి ప్రభుత్వమే గోశాలలకు దాణా, నీటిని అందించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ సీఎం రేవంత్‌రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లయన్స్ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోశాలలకు పశుదాణాను, రాక్ సాల్ట్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఉప్పుగూడలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న గోశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో పశుదాణా అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రేమ్ చంద్ మునోద్, చేపూరి లక్ష్మణ్ చారి, దిలీప్ కుమార్, బాబురావు, మనోహర్ రాజు, దాసోజు లక్ష్మణ్ పాల్గొన్నారు.

28న నాదమ్ నృత్యోత్సవం

చిక్కడపల్లి: కూచిపూడి నృత్యగురువుల బృందం సిద్ధ నాట్యకళాసమితి ఆధ్వర్యంలో నాదమ్ శీర్షికతో ఈ నెల 28న నృత్యోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాణీరమణ, ఆర్.చంద్రశేఖర్‌లు తెలిపారు. ఉప్పల్ శిల్పారామంలో జరిగే ఈ కార్యక్రమంలో ఏడుగురు గురువులు, 84 మంది ప్రముఖ సంగీత విద్వాంసులు స్వాతి తిరునాళ్ రచించిన తిల్లాన, భజన, కీర్తనలు, వేదపఠనం, స్వరజతి వంటి అంశాలతో నృత్యప్రదర్శన ఉంటుందని వివరించారు. ప్రముఖ వాగ్గేయకారులలో ఒకరైన తిరునాళ్ సంస్కృతం , హిందీ భాషల్లో రచించిన కీర్తనలు, భజనలు తిరువనంతపురం అనంత పద్మనాభస్వామికి అంకితం చేశారన్నారు. సంగీతనాటక అకాడమీ పురస్కారగ్రహీత మద్దాళి ఉషాగాయిత్రి, సంగీత ఆమని విజయనగరం డి.వర్ధిని ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధంవారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. నృత్యగురువులు రేణుకాప్రభాకర్, శ్రీలత, నిష్ఠల సుధామాల, మాధవీమాల, ధరణి అడపా, సాత్విక పాల్గొన్నారు.

శక్తి సామర్థ్యాలను సాక్షాత్కరింపజేసిన హిప్నో కమలాకర్



ముషీరాబాద్: మానవ శక్తి సామర్థ్యాలను హిప్నాటిజం ద్వారా సాక్షత్కారింపజేసిన వ్యక్తి హిప్నో కమలాకర్ అని జోనల్ చైర్‌పర్సన్ లయన్ సి.హెచ్.గోపాలకృష్ణ, బి.సరోజినీరామారావు అన్నారు. ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లాయన్స్ క్లబ్ సహకారంతో డాక్టర్ హిప్నో కమలాకర్ జయంతి, వర్ధంతి వేడుకలను ముషీరాబాద్ తెలంగాణ భవిత సెంటర్ (మానసిక వికలాంగుల పాఠశాల) నిర్వహించారు. ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యోగా గురువు సరోజినీరామారావు, సైకాలజిస్ట్ జ్యోతిరాజా, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ తదితరులు ప్రసంగించారు. పిల్లలకు పజిల్స్ పుస్తకాలు, పోషకాహారం, మందులను పంపిణీ చేశారు. రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ మహేందర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.